క్లుప్తంగా

వర్షం కురవాలని పూజలు



కప్పతల్లి ఆడుతున్న ప్రజలు

దహెగాం: గత కొన్ని రోజుల నుంచి వర్షాలు లేని కారణంగా పంటలు వాలిపోతున్నాయని ఆందోళన చెందుతున్న రైతులు వరుణుడు కరుణించి వర్షం కురువాలని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆదివారం మండలంలోని రాంపూర్ గ్రామంలో రైతులు కప్పతల్లి ఆడారు. దేవత విగ్రహాలకు జలాభిషేకం చేశారు. వర్షం కురువాలని మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కొలువులు సాధించిన అభ్యర్థులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో తుంగెడ గ్రామంలో ఉపాధ్యాయ కొలువులు సాధించిన బోర్కుటే వెంకటేశ్, పూదరి ప్రశాంత్‌లను ఆదివారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి ప్రభుత్వ కొలువులు సాధించి ఇతర యువకులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రభుత్వ కొలువులు సాధించటం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలు వీరే



పల్సర్ బైక్ అందజేస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లా కేంద్రంలో కొలువుదీరిన దుర్గా, శారదా మండలిల వద్ద తీసిన లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి శారదా మండలి వద్ద నిర్వహించిన లక్రీ డ్రాలో పల్సర్ బైక్‌ను ఉట్నూర్‌కు చెందిన కవిత సొంతం చేసుకోగా, రెండో బహుమతి సామ్‌సంగ్ ఫ్రీజ్‌ను దినేష్‌కుమార్, మూడో బహుమతిగా రాథోడ్ నాందేవ్ 43 ఇంచెస్ ఎల్ఈడీ టీవి, నాలుగో బహుమతిగా బట్టర్‌ఫ్లై మిక్సర్‌ను జగిత్యాల్‌కు చెందిన రిహాన్స్, ఐదో బహుమతిగా బట్టర్‌ఫ్లై కుక్కర్‌ను సొంతం చేసుకొన్నారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు పుల్లూరి శంకర్, క్లబ్ ప్రతినిధులు విజేతలను శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గుండా బాలేష్, అశోక్, నగేశ్, విశ్వేశ్వర్, పాపిని శంకర్, వెంకన్న, శ్రీనివాస్, ప్రశాంత్, రావుల శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం పోరాటాలు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: అభివృద్ధి కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో 11వ పట్టణ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకురాలు లంక జమున ముందుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు అమరవీరులు సీతారాం ఏచూరి, పుచ్చలపల్లి సుందరయ్య, బుద్ధదేవ్ భట్టాచార్య, మల్లు స్వరాజ్యంలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం ఇళ్ల స్థలాల కోసం చేసిన పోరాటాల ఫలితంగా పట్టణం విస్తరించిందని అన్నారు. రణదివేనగర్, సుందరయ్యనగర్, భగత్‌సింగ్‌నగర్, దుర్గానగర్, వరలక్ష్మినగర్, లీలానగర్, గాంధీనగర్ లాంటి అనేక వార్డులు ఆవిర్భవించాయన్నారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ వరకు రైల్వేలైన్ సాధన, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణ కోసం, విమానాశ్రయం నిర్మాణం, టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు కోసం ఉద్యమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సురేందర్, మంజుల, బొజ్జ ఆశన్న, అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, కోవే శకుంతల పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య గ్రామస్తులు జమ్మిచెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆకులు సేకరించి కుటుంబ సభ్యులు, బంధువులకు ఇచ్చి ఆలింగనం చేసుకున్నారు. దసరా శుభాకాంక్షలు చెప్పుకొని సరదాగా గడిపారు. రాజకీయ పార్టీ కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ప్రజలు వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో రావణ దహన కార్యక్రమాలను చేపట్టారు.

\- సాక్షి, నెట్‌వర్క్



బెజ్జూర్: దసరా ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు



దహెగాంలో..



కెరమెరి: జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న పటేల్ సోనేరావు



కెరమెరి: పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న గ్రామపెద్దలు



ఆసిఫాబాద్‌రూరల్: జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు



కౌటాల: వాసవీమాత ఆలయంలో..

వంతెన పనులు ప్రారంభమెప్పుడో?



కొట్టుకుపోయిన కల్వర్టు పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు (ఫైల్)

- రూ. 2 కోట్ల 64 లక్షలు మంజూరు
- నేటికి ప్రారంభం కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి నుంచి గొల్లవాడకు వెళ్లే దారిలోని గొల్లవాగు వాగుపై నిర్మించిన కల్వర్టు గత ఏడాది జులైలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండపల్లి నుంచి గొల్లవాడకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గతేడాది ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణానికి రూ. 2 కోట్ల 64 లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించటానికి అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఏళ్లు గడిచినా.. వంతెన పనులు ప్రారంభించకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ పనులకు కలగని మోక్షం..

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. గత ఏడాది వంతెన నిర్మాణాన్ని ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ సాయిల్ పరీక్షలు కూడా పూర్తి చేశాడు. వంతెన నిర్మాణ ప్రాంతంలో గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశాడు. దాదాపు సంవత్సరం కాలం గడిచినా.. నేటికి నిర్మాణ పనులకు మోక్షం కలుగలేదు. నిత్యం ఇదే దారి గుండా రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన లేక పశువులు ఒర్రెలో కొట్టుకుని పోయాయి. వంతెన లేక అష్టకష్టాలు పడుతూ ఎరువులను పంట చేలకు తరలిస్తున్నామని వాపోతున్నారు. పండించిన పంటలను తరలించటానికి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వంతెన లేక ఇబ్బంది



వాగుపై నిర్మించిన కల్వర్టు కొట్టుకుని పోయింది. చేలకు ఎరువులు తరలించటానికి వాగు మార్గంలో పయనిస్తున్నాం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్నాం. కొన్ని సమయాల్లో ప్రమాదాలు కూడా జరుతున్నాయి.

\- ఆత్రం సిద్ధు, రైతు, కొండపల్లి

అంబులెన్సు రాని పరిస్థితి



వాగుపై వంతెన లేక అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఉదతంగా ప్రవహిస్తున్న వాగు నుంచి ఎడ్ల బండ్ల ద్వారా ప్రధాన రహదారికి చేరుకుంటున్నాము. గ్రామానికి 108 వచ్చే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

\- గెడెం కిరణ్, గొల్లవాడ

గ్రామాల్లో సద్దుల సందడి



కన్నెపల్లిలో సద్దుల బతుకమ్మలతో మహిళలు

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూజలతో బతుకమ్మను పేర్చారు. మహిళలు, యువతులు, చిన్నారులు సద్దుల బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలు పాడుతూ సల్లంగా చూడు తల్లి అంటూ సందడి చేశారు. అనంతరం స్థానిక వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

జోడేఘాట్‌లో మహారాష్ట్ర వాసులు



భీం విగ్రహానికి మొక్కుతున్న మహారాష్ట్ర ఆదివాసీలు

కెరమెరి: మహారాష్ట్రలోని చంద్రాపూర్, యవత్‌మాళ్ జిల్లాలకు చెందిన కుమురంభీం అభిమానులు, భక్తులు ఆదివారం జోడేఘాట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ మరునాడు కుమురం భీం వర్ధంతి అనుకుని ఆదివారం జోడేఘాట్‌కు వచ్చామని, కానీ వర్ధంతి గురువారం అని తెలిసిందన్నారు. తమకు ముందస్తు సమాచారం లేదని పేర్కొన్నారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. సమాధికి పూజలు చేశారు. జెండాలకు మొక్కారు. మ్యూజియంను సందర్శించారు. కుమురం భీం సహచరులతో మాట్లాడుతున్న, గుస్సాడీలు నృత్యాలు చేస్తున్న ప్రతిమలను, ఆదివాసీల ఆభరణాలను, దేవతలను తిలకించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



కొత్తగూడలో పూజలో పాల్గొన్న భక్తులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు మండపాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బెజ్జూర్: నవరాత్రులు పూజలు అందుకున్న దుర్గాదేవి, శారదా దేవి నిమజ్జన కార్యక్రమాన్ని బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. మంగళ వాయిద్యాలతో పాటు డీజే చప్పుళ్లకు భక్తులు నృత్యం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌటాల సీఐ రమేశ్, బెజ్జూర్ ఎస్సై విక్రమ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



కోలాటం ఆడుతున్న మహిళలు, యువతులు

ఘనంగా దమ్మచక్ర దినోత్సవం



వీరవెల్లిలో దమ్మచక్ర దినోత్సవ వేడుకలు

కౌటాల: దళిత బాంధవుడు, బీఆర్ అంబేద్కర్ 1956లో నాగపూర్‌లోని దీక్ష భూమిలో చేపట్టిన దమ్మ చక్ర పరివర్తన దినోత్సవం పురస్కరించుకొని శనివారం 68వ దమ్మచక్ర దినోత్సవాన్ని మండలంలోని మహార్ ప్రజలు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మహార్ కులస్తులు శాంతి ర్యాలీ చేపట్టారు. అలాగే యాపలగూడ, వీర్దండి, బోదంపల్లి, ముత్తంపేట, గుండాయిపేట, గుడ్లబోరి, బాలేపల్లి, తాటిపల్లి, కనికి, వీరవెల్లి, పార్డీ గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాల, చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జెండాను ఎగరవేసి, బౌద్ధ గీతం ఆలకించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు దుర్గం జానకిరామ్, దాగం ఆగయ్య, దీలిప్, అశోక్, రాజ్‌కుమార్, రావుజీ, పాపయ్య, మోతిరాం, శంకరయ్య, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు'

ఎదులాపురం: దసరా ఉత్సవంలో భాగంగా నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్‌ను ఆహ్వానించకుండా హిందూ ఉత్సవ సమి తి అధ్యక్షుడు హన్మండ్లు ఏకపక్షంగా వ్యవహరించా రని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం, కౌన్సిలర్లు అన్నా రు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు పట్టణ ప్రథమ పౌరుడిని వేడుకలకు ఆహ్వానించకపోవడం సరికాదని, ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

దసరా వేడుకలకు పట్టణ ప్రథమ పౌరుడిని ఆహ్వానించకపోవడాన్ని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కాళ్ల విఠల్ తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మండ్లు వైఖరిని తప్పుబట్టారు. ఇలాంటి మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

'నియంతలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ఆదిలాబాద్ తన సొంత జాగీరు అనుకుని ఒక జమీందారులా భావిస్తున్నాడని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. దసరా వేడుకల ఆహ్వాన పత్రికలో మాజీ మంత్రి జోగు రామన్న పేరు కాని, పట్టణ ప్రథమ పౌరుడు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పేరు కానీ లేకుండా ఉత్సవాలు నిర్వహించడాన్ని తప్పుబట్టారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఏకపక్ష నిర్ణయాలతో అందరిని కలుపుకపోయే మంచి సంస్కృతిని విస్మరిస్తున్నాడని, ఆరోపించారు. సమావేశంలో నాయకులు గుడిపల్లి నగేశ్, మునిగెల నర్సింగ్, మంచికట్ల ఆశమ్మ, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, పోరెడ్డి కిషన్, షకీల్, దొగ్గలి రాజేశ్వర్, ఖయ్యుం, మానే శంకర్, మంచాల మల్లయ్య, రాహుల సోమన్న పాల్గొన్నారు.

నేడు సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం ఉదయం 10 గంటలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మిదుగా సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4892 రూపాయలతో రైతుల నుంచి సోయా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమురంభీం వర్ధంతి విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: కేరిమెరి మండలంలోని జోడేఘాట్ వద్ద ఈనెల 17న నిర్వహించే కుమురం భీం వర్ధంతి విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా నలు మూల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు, నాయకులు జుగ్నాక్ భారత్, గేడం భారత్, ఆత్రం అశోక్, తదితరులు పాల్గొన్నారు.